ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకురాలు శోభారాణి

టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

ఆమనగల్లు, మే 14: వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు శోభారాణి మార్కెట్ అధికారులకు సూచించారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యం కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం 15-16 శాతం ఉండేలా చూడాలన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆమె రైతులకు సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి, ఏఈవోలు శ్రీనాథ్, మీనాక్షి, నిఖిత తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు కార్మికులు సంఘటితం కావాలి

కడ్తాల్, మే 14: హక్కుల సాధన కోసం కార్మికులు సంఘటితమై పోరాడాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న దేశ వ్యాప్తంగా చేపట్టే సమ్మె గురించి, బుధవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ఆయన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కోసం చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి, గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ రాఘవేందర్, ఆటో ట్రావెల్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు మల్లేశ్, హమాలీ సంఘ మండలాధ్యక్షుడు రమేశ్, సభ్యులు శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం

కొత్తూరు, మే 14: అండర్ గ్రౌండ్ డ్రైనేజీల ఏర్పాటు ద్వారా మున్సిపాలిటీని పరిశుభ్రంగా మారుస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యాదేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని మూడో వార్డులో మున్సిపాలిటీ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ మున్సిపాలిటీని మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, సోమ్లానాయక్, గోపాల్‌గౌడ్, శ్రీనివాస్, జనార్దనచారి, యాదయ్య, మాజీ ఎంపీటీసీలు రాజేందర్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

8 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం

చేవెళ్ల రూరల్, మే 14 : పేకాట ఆడుతున్న 8 మంది పట్టుబడిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో చేవెళ్ల మున్సిపల్ పరిధి దేవునిఎర్రవల్లి వార్డులోని ఫామ్ ల్యాండ్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రాజేంద్రనగర్ జోన్ సీఐ అంజయ్య, ఎస్ఐలు రవికుమార్, రాజశేఖర్ రెడ్డిల బృందం దాడులు నిర్వహించి పేకాడుతున్న 8మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. పేకాటలో గెలిచిన వారికి మొత్తం రూ.2 లక్షల 41 వేల నగదు ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేయొద్దు

చేవెళ్లటౌన్, మే 14: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు చేపట్టవద్దని పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్లలోని ఏ ప్రైవేట్ పాఠశాలకు కూడా సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి ప్రభుత్వ అనుమతి లేదన్నారు. పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్‌లు, షూస్, గైడ్స్, తదితర ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

కేశంపేట, మే 14 : కారు, బైక్ ఢీకొన్న ఘటనపై కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన కృష్ణ(32) ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడెం గ్రామానికి చెందిన రాజు ఇద్దరు కేశంపేటలో ఓ వివాహానికి హాజరయ్యారు. కాగా, తిరుగు ప్రయాణంలో బీఎస్‌వై గార్డెన్ వద్దకు రాగానే కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొందని, ఈ ప్రమాదంలో కృష్ణ, రాజులకు గాయాలయ్యాయన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారని, బాధితుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ సుధాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూసారంతోనే పంట దిగుబడి

మొయినాబాద్ : చిన్నమంగళారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పీజేటీఎస్ఏయూ శాస్త్రవేత్త

మొయినాబాద్, మే14: రైతులు ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వాడటం వలన దిగుబడి కంటే భూసారంపై ప్రభావం పడుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అలీబాబా, డాక్టర్ చిరంజీవి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సంయుక్తంగా చేపట్టిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు సాగు చేసే ముందు రైతులు మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేస్తే భూమిలోని సారాన్ని బట్టి రసాయన ఎరువులు వేసుకుంటే రైతులు ఆశించిన మేర పంట దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. యూరియా, పురుగుల మందులు సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. దీని వలన ఖర్చులు తగ్గించడంతో పాటు మట్టిలోని పౌష్టిక విలువలను పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ సురేశ్‌బాబు మాట్లాడుతూ పంట మార్పిడి చేయడంతో పాటు సేంద్రియ ఎరువులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేసుకుంటే రైతులు కొంత ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగిస్తే పంట పైరు బాగా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, ఉద్యాన శాఖ అధికారి కీర్తి కృష్ణ, ఏఈవో సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ నాయకులు రాములు పాల్గొన్నారు.

కవాడిపల్లిలో పంటల సాగు పై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

కవాడిపల్లిలో..

అబ్దుల్లాపూర్‌మెట్ : నేల ఆరోగ్య సంరక్షణ కోసం వ్యవసాయ పరిశోధన సంస్థ సిఫారసు చేసిన మోతాదులో రైతులు ఎరువులు, రసాయనాలను ఉపయోగించి పచ్చి రొట్ట ఎరువులను వాడాలని వ్యవసాయ పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ డైరెక్టర్ జి శ్రీనివాస్ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కవాడిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు వ్యవసాయంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ యూరియాను వాడి సాగు ఖర్చును తగ్గించుకోవాలని తెలిపారు. అవసరం మేరకు రసాయనాలను ఉపయోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పంట మార్పిడి ఆవశ్యకత, పర్యావరణ సంరక్షణపై పలు సూచనలు చేశారు. పంటల్లో రసాయనాల యాజమాన్యం, పురుగు తెగుళ్ల యాజమాన్యం, నేలసారం పెంచే విధానాలు, పంటల మార్పిడిపై శాస్త్రవేత్తలు డాక్టర్ కె కవిత, డాక్టర్ ఎం జమీమా వివరించారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త ఎస్ పల్లవి, మండల వ్యవసాయ శాఖ అధికారి పల్లవి, విస్తరణ అధికారి రఘుపతి, పంచాయతీ కార్యదర్శి రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, మే 14: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పట్టణంతో పాటు వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కొందుర్గు, చౌదరిగూడ, కొత్తూరు, కేశంపేట, నందిగామ మండలాలకు సంబంధించిన 190మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా మంజూరైన రూ.1,90,22,040 చెక్కులను, సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్, కరుణాకర్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శివశంకర్, బాల్‌రాజు, కృష్ణారెడ్డి, బస్వం, ఇబ్రహీం, సీతారామ్ పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట, మే 14 : కేశంపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవి, నర్సింహులు, మల్లేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆర్థిక సాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. రవికి రూ.44వేలు, నర్సింహులుకు రూ.44వేలు, మల్లేశ్‌కు రూ.22వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, నాయకులు కృష్ణారెడ్డి, ఇబ్రహీం, సుదర్శన్ పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు : సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను చౌదరిగూడ మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేసి మాట్లాడారు. చౌదరిగూడ మండలానికి చెందిన పాపయ్య, మహ్మద్ షఫీ, కృష్ణయ్య, శ్రావ్య అనారోగ్యంతో బాధపడుతున్నారని, మెరుగైన చికిత్సకోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, వారికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, చంద్రశేఖర్, రాజేశ్, అజహర్‌అలీ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

తుర్కయాంజాల్, మే 14: మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు రోజులుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా చేయడం లేదని ఎక్కడ వర్షం పడి ధాన్యం తడిసిపోతుందనే భయంతో ఉంటున్నాయని ఆయనకు తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

షాబాద్, మే 14: ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని ఎలక్ట్రిక్ బస్సుల కంపెనీ ఎదుట కార్మికులతో కలిసి దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ షాబాద్ మండల కన్వీనర్ నర్సింహ, ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

గిరిజనులు, చెంచుల సంక్షేమానికి పెద్దపీట

ఆమనగల్లు, మే 14: గిరిజనులు, చెంచుల సంక్షేమ, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి అన్నారు. చెంచులకు ప్రభుత్వం ఇచ్చిన పోడు భూములను సాగులోకి తెచ్చేందుకు వారికి ఇందిరా గిరి సౌర జల వికాస పథకం కింద బోరు మోటర్లు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లురవి మాట్లాడుతూ ఇందిరా గిరి సౌర జల వికాస పథకాన్ని ఈ నెల 18న మున్ననూర్‌లో సీఎం ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. రూ.12,600 కోట్లతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద చెంచులకు 10 వేల ఇండ్లు మంజూరుచేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కేశవులు, చెంచు సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లీ రాములు, మున్సిపాలిటీ అధ్యక్షుడు మానయ్య, నాయకులు ఖాదర్ ఖాద్రీ, రాఘవేందర్, కృష్ణయ్య, చంద్రయ్య, రమేశ్, అంజినాయక్, కృష్ణ, కిషన్, శ్రీనూనాయక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

షాబాద్, మే 14: గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పోతుగల్ పంచాయతీ కార్యదర్శి అశోక్ అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ప్రభుత్వం ఇండ్లు అందించడం జరుగుతుందన్నారు. పోతుగల్ గ్రామంలో 31 మందికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, వాటి కొలతలు తీసుకోవడం జరిగిందన్నారు. త్వరలో ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది తదితరులున్నారు.

బీసీ సేన నూతన కమిటీల ఎన్నిక

కొందుర్గు, మే 14 : మండల పరిధిలోని వీరసముద్రం గ్రామంలో బీసీ సేన నూతన కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా జానంపేట యాదమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రం అందజేశారు. బీసీల హక్కుల సాధనకోసం కృషి చేస్తానని యాదమ్మ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీసేన నేతలు జయశ్రీకాంత్, కవిత, మంజుల, చంద్రశేఖర్, శ్రీను, వెంకటేష్, బాల్‌రాజ్, శ్రీనివాస్, వెంకటమ్మ, బిపాషా, మనీల, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

బడంగ్ పేట్, మే 14: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు దాసరి బాబు డిమాండ్ చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్మిక డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మె గోడ పోస్టర్లను మీర్‌పేట్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో, తుక్కుగూడ పట్టణంలో ఏఐటీయూసీ దత్తు నాయక్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌ల లోకి మార్చి కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని వారు ధ్వజమెత్తారు. మే 20న సార్వత్రిక సమ్మెను అఖిల భారత కార్మిక సంఘాలు, ఫెడరేషన్ లు నిర్వహిస్తున్న సమ్మె నేపథ్యంలో ఆ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. చాలీచాలని జీతాలు కార్మికులను తీవ్రంగా కలచివేస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జరిగే సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ధనుంజయ, వెంకటయ్య, నరసింహ, బాలకృష్ణ, మల్లికార్జున్, జీవన్, రజిత, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.దేవేంద్రగౌడ్, ఆటో యూనియన్ నాయకులు నరసింహ, సురేష్, వైట్ క్లిప్ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎన్.యాదగిరి, నాయకులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కందుకూరు, మే 14 : అంగన్‌వాడీ కేంద్రాలను డయ్యూడమన్ నుంచి వచ్చిన కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం సుభాషిత్ గ్రామపంచాయతీ కింద మండల పరిధిలోని జైత్వారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు మహేశ్వరం మండలంలోని దుబ్బచెర్ల, సుభాన్ పూర్ కేంద్రాలను ఎంపిక చేశారు. అందులో భాగంగా బుధవారం ఆ సెంటర్ లను పరిశీలించారు. 5 సంవత్సరాలలోపు పిల్లల ఎత్తు, బరువులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులు అయిన విద్యుత్, తాగునీరు, మూత్రశాలలను తనిఖీ చేశారు. ఆరోగ్య లక్ష్మి, ప్రీ సిలబస్, ఇంటింటి అంగన్‌వాడీ రిజిస్టర్‌ను పరిశీలించారు. గర్భిణి, బాలింతలకు అంగన్‌వాడీ ద్వారా అందుతున్న సేవలను ప్రాజెక్టు అధికారి శాంతిశ్రీ వారికి వివరించారు. పోషణ పక్వాడ ద్వారా ప్రజల్లో పోషణ పై అవగాహన చైతన్యం కల్పించినట్లు తెలిపారు. దీంతో మహేశ్వరం ఐసీడీఎస్ జిల్లాలోని ప్రథమ స్థానంలో ఉన్నట్లు వివరించారు. తక్కువ ఖర్చుతో చిరుధాన్యాలను తయారు చేసుకునే విధంగా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర బృందం మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. చిన్నపిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డామన్, డయ్యు బృందం నుండి వచ్చిన ప్రీతం జైలం, కొండ రామకృష్ణ, సీడీపీఓ శాంతిశ్రీ, సూపర్ వైజర్లు ఇందిరా, సువర్ణ, విద్యావతి, టీచర్లు సుమతి, అనిత, సంతోష, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులను పునరుద్ధరించండి

గుడ్ మార్నింగ్ ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ నాయకులు

గుడ్ మార్నింగ్ మణికొండ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మణికొండ, మే 14 : మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ' కార్యక్రమంలో భాగంగా బుధవారం అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 4 పక్కన ఉన్న స్థానిక ప్రజలతో కలిసి నాయకులు వారి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

- సెక్టార్ వన్ డీ బ్లాక్ రోడ్డు నంబర్ 4లో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉన్నదని కోరారు.
- అల్కాపూర్ టౌన్షిప్ నుంచి నార్సింగ్ రోడ్డు సాయి గౌతమ్ కాలనీ మీదుగా పుప్పాలగూడ రోడ్లు చాలా కాలం నుంచి అందుబాటులోకి రాని కారణంగా అల్కాపూర్ టౌన్షిప్ నుంచి వచ్చే ట్రాఫిక్‌కు సరైన రోడ్డు మార్గం లేక స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు.
- వీధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో పలుమార్లు మణికొండ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు పరిష్కారం కాలేదు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.
- అల్కాపూర్ టౌన్షిప్ వాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న విషయాన్ని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తేవడం ద్వారా తగు చర్యలు తీసుకోగలమని హామీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీద నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, సంఘం శ్రీకాంత్, భానుచందర్, ఆరీఫ్ మహమ్మద్, శ్రీధర్, షైక్ ఆరీఫ్, సుమనళిని, చెరుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం, మే 14 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం పోలీసుల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేట్ గేటు వద్ద మద్దెల ఎట్టయ్య(70) బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం నుంచి ఆరుట్ల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఎట్టయ్య అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు రోడ్డు ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చూరీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధి దీపాల సమస్య పరిష్కరించాలి

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ మంజులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ, మే 14: వీధి దీపాల సమస్య పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలు కాలనీవాసులు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ మంజులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ఆస్తిపన్ను వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ సమస్యల పరిష్కారానికి చూపడం లేదని తెలిపారు. ఓం నగర్, ధాత్రి కాలనీవాసులు కలిసి స్ట్రీట్ లైట్ల కోసం ఏర్పాటు చేసుకున్న వైర్లను సైతం కార్పొరేషన్ లైన్‌మెన్లు తీసుకెళ్లారని ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా విద్యుత్ దీపాల మరమ్మతుల కోసం ఏర్పాటుచేసిన సూపర్‌వైజర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు కూడా విద్యుత్ దీపాలు వెలగకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఓంనగర్ కాలనీ అధ్యక్షుడు మన్నె నవీన్ కుమార్, ధాత్రి కాలనీ అధ్యక్షులు శివారెడ్డి, కాలనీవాసులు ఆనంద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

ప్రసాద్ నగర్ కాలనీలో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కమిషనర్ శరత్ చంద్ర

బండ్లగూడ, మే 14: ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర పేర్కొన్నారు. కమిషనర్ శరత్‌చంద్ర సమక్షంలో వన్డే వన్ థీమ్ అనే కార్యక్రమంలో భాగంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

బీజేపీ మంత్రిని అరెస్టు చేయాలి

పెద్దఅంబర్‌పేట, మే 14: ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తిప్పికొడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు నాయకత్వం వహించి సక్సెస్ చేసిన సోఫియా ఖురేషీని పాకిస్తాన్ తీవ్రవాదుల సోదరి అని వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ మంత్రి అజయ్‌షాను వెంటనే అరెస్టు చేయాలన్నారు. దేశ సైనికుల త్యాగాలను కొందరు బీజేపీ నాయకులు పార్టీ ప్రయోజనాల కోసం చాలా దుర్మార్గామని మండిపడ్డారు. బీజేపీ మంత్రిని వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించి దేశద్రోహం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.